'నర్సింగ్'లో ప్రైవేటు పెత్తనం

- ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రైవేటు వ్యక్తుల హవా
- అడ్డగోలుగా పుస్తకాలు, దుస్తులు, భోజనాలు విక్రయం
- జిల్లా కలెక్టర్ అనుమతిగానీ, టెండర్లుగానీ లేనేలేవు
- కమీషన్ల కోసమే కళాశాల అధికారుల కక్కుర్తి అని ఆరోపణ

గుంటూరు గోరంట్లలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టర్ అనుమతులు లేకుండా, ఎలాంటి టెండర్లు పిలవకుండా ప్రైవేటు వ్యక్తులు కళాశాలకు వచ్చి భోజనం పెట్టడం, పుస్తకాలు, దుస్తులు విక్రయిస్తుండటం గమనార్హం. – గుంటూరు మెడికల్



గోరంట్ల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

గుంటూరు గోరంట్లలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టర్ అనుమతులు లేకుండా, ఎలాంటి టెండర్లు పిలవకుండా ప్రైవేటు వ్యక్తులు కళాశాలకు వచ్చి భోజనం పెట్టడం, పుస్తకాలు, దుస్తులు విక్రయిస్తుండటం గమనార్హం. కళాశాల అధికారులే వారికి వత్తాసు పలుకుతూ ముడుపులు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

బలవంతంగా కొనుగోలు చేయిస్తూ...

నర్సింగ్ విద్యార్థులు పుస్తకాలను, దుస్తులను తాము చెప్పిన వారి వద్దే కొనాలంటూ కళాశాల అధికారులు ఆదేశాలు జారీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరు అరండల్‌పేట 10వ లైనుకు చెందిన ప్రైవేటు పుస్తకాల షాపు వారిని నేరుగా కళాశాలకు తీసుకొచ్చారు. మూడు రోజులుగా ఇలా పుస్తకాలు విక్రయిస్తున్నారు. ప్రైవేటు వస్త్ర దుకాణానికి చెందిన వారు సైతం ఇదే తరహాలో దుస్తులు విక్రయించారు.

అంతా ఇష్టారాజ్యం

నిబంధనల ప్రకారం కళాశాలలో ఏమైనా అమ్మకాలు చేయాలంటే టెండర్ల ద్వారా లేదా జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కళాశాల అధికారులు మాత్రం ఇష్టానుసారంగా చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. గతంలోనూ విద్యార్థుల నుంచి యూనిఫాం, పుస్తకాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ. 6 వేల – రూ. 8 వేల వరకు వసూలు చేశారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో నేడు కొత్త పంథాకు నాంది పలికారు. నేరుగా డబ్బులు తీసుకోకుండా ప్రైవేటు వ్యక్తులను కళాశాలకు తీసుకొచ్చి విక్రయాలు జరిగేలా చూస్తున్నారు. వారి నుంచి కమీషన్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు నచ్చిన చోట పుస్తకాలు, వస్త్రాలు కొనకుండా అధికారులు అడ్డుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

భోజనాల తీరూ ఇంతే..

విద్యార్థులకు భోజనం పెట్టడానికి కూడా కాంట్రాక్టును జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని, లేదా టెండర్ల ద్వారా ఖరారు చేయాల్సి ఉంటుంది. అధికారులు తమకు నచ్చిన ప్రైవేటు వ్యక్తులతో భోజనం పెట్టిస్తున్నారు. భోజన నాణ్యత కూడా ఆశించినంత లేదనే విమర్శలు ఉన్నాయి. నర్సింగ్ కోర్సు పూర్తి చేసుకుని వెళ్లిపోయే విద్యార్థులకు టీసీ మంజూరుకు సైతం కొంత మంది వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కళాశాలలో ప్రైవేటు పెత్తనంపై దృష్టి సారించాల్సి ఉంది. నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని, ప్రైవేటు వ్యక్తులు నేరుగా కళాశాలలో విక్రయాలు జరపుతున్న తీరుపై కళాశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో 'సాక్షి' సంప్రదించగా స్పందించలేదు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో శనివారం పౌర్ణమి, దత్త జయంతి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీరామ కోటి మహోత్సవాలు

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామ క్షేత్రంలో 98వ శ్రీరామ కోటి మహోత్సవాలను ఈనెల 16 నుంచి 21 వరకు నిర్వహిస్తున్నట్లు శృంగేరి పీఠపాలిత శ్రీసీతారామ సంకీర్తన సంఘం కార్యనిర్వాహకులు రాగం వెంకటలీలాసుందరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజులపాటు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చే సమాజాల అఖండ హరినామ సంకీర్తనలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ఉత్సవమూర్తుల నగరోత్సవం, బుర్రకథలు, హరికథలు ఉంటాయని పేర్కొన్నారు. 16న అంకురారోపణ, అఖండజ్యోతి స్థాపన, 17న శ్రీరామకోటి తులసి సహస్రనామార్చనలు, 18న శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం, 19న శ్రీప్రసన్నాంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన, 20న శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం, 21న తెప్ప తిరునాళ్ల క్షేత్ర పుష్కరిణిలో జరుగుతాయని వివరించారు. భక్తులంతా హాజరుకావాలని ఆమె కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పట్నంబజారు: రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఎవరికైనా హాని కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఏ.వి.శివప్రసాద్ హెచ్చరించారు. శనివారం లాలాపేట పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, పంచాయతీలు చేస్తున్నారని తెలిసినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి రౌడీషీటర్ ఇంటి వద్ద తనిఖీలు చేయడంతోపాటు, సమాచారం తెలుసుకుంటామని చెప్పారు. బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తుంటే క్షమించేది లేదని హెచ్చరించారు.

ఘనంగా తిరుప్పనల్వార్ శోభాయాత్ర

నెహ్రూనగర్: తిరుప్పనల్వార్ తిరు నక్షత్ర జయంతి సందర్భంగా చుట్టుగుంట నుంచి ఐఎంఏ వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీనివాస్ మాట్లాడుతూ తాము హరిదాసులకు పురోహితులుగా సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తున్న మూల వారసులుగా ఉన్నామని తెలిపారు. అక్షయపాత్రను శిరస్సును ధరించుకొని ప్రతి వీధిన హరినామ స్మరణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హరిదాసు సంఘం నాయకులు కోటి రామాంజనేయులు, శ్రీనివాస్, ఈశ్వరరావు, చెన్నకేశవులు, సాంబశివరావు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య



గుంటూరు మెడికల్: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తున్న జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్యని గుంటూరు జిల్లా తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసిమల్ల రాజేష్ తెలిపారు. పులివెందులలో సాక్షి విలేఖరిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో నగరంపాలెం గుర్రం జాషువా విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ వృత్తిలో భాగంగా వార్తల సేకరణకు ప్రాణాలు సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న జర్నలిస్టులపై అకారణంగా దాడులు చేయడం దారుణమని ఖండించారు. ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ అహ్మద్ మాట్లాడుతూ విలేకరులపై దాడులకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.వి. సాంబశివరావు, కమిటీ మెంబర్స్ నేలటూరి నాగరాజు, రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన విద్యార్థిని


లక్ష్మీ సుమేధను అభినందిస్తున్న డాక్టర్ హేమంత్, విష్ణువర్ధన్, కృష్ణవేణి, వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 8న జరిగిన 22వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ఐదో తరగతి విద్యార్థిని ఎం.లక్ష్మీ సుమేధ అండర్-12 బాలికల కటా విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం లక్ష్మీపురంలోని పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌లో ప్రముఖ జనరల్ ఫిజీషియన్‌గా సేవలందిస్తున్న డాక్టర్ సి. హేమంత్ మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదివిన తాను, ఎన్నో అవార్డులను గెలుపొందానని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలకు చెందిన చిన్నారికి తన చేతుల మీదుగా స్వర్ణ పతకాన్ని అందజేయడం గర్వకారణమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ కరాటే అనేది ఆడపిల్లలకు ఆత్మ రక్షణనే కాకుండా శారీరక, మానసిక దృఢత్వానికి దోహదపడుతుందని అన్నారు. విద్యార్థిని మెరుగైన శిక్షణ ఇచ్చిన కోచ్ కె.సురేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కోఆర్డినేటర్స్ దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు


సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

లక్ష్మీపురం: దేశంలో జమిలి ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్.బాబూరావు పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని పి.ఎల్‌రావు భవన్‌లో సీపీఎం 25వ జిల్లా మహాసభలు ప్రారంభం అయ్యాయి. శని,ఆదివారాల్లో జరిగే ఈ మహాసభలలో బాబూరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. సభకు జిల్లా నాయకులు కె.నళినీకాంత్, ఎస్.ఎస్.చెంగయ్య, ఎల్.అరుణ నేతృత్వం వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని సీనియర్ కార్యకర్త తియ్యగూర అంజిరెడ్డి ఆవిష్కరించారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లా కమిటీ సభ్యులు వల్లభనేని సాంబశివరావుకు మహాసభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ జమిలి ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగుతుందని చెప్పారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే పార్టీ పేరుతో రాజకీయంగా లబ్ధి పొందడానికి బీజేపీ చేస్తున్న కుట్రలో ప్రాంతీయ పార్టీలు కూడా చిక్కుకుంటున్నాయని తెలిపారు. బీజేపీ హయాంలో దేశ రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందని, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి ఆర్ఎస్ఎస్ రాజ్యాంగం అమలుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. శాసన మండలి సభ్యులు కె.యస్.లక్ష్మణరావు మాట్లాడుతూ కల్తీ విత్తనాలు, పురుగు మందులకు జిల్లా అడ్డాగా మారిందని, రైతాంగం పెద్దఎత్తున నష్టపోతున్నా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు శూన్యమని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. నాణ్యమైన బియ్యం సరఫరా చేయలేని ప్రభుత్వం నాణ్యమైన మద్యం సరఫరా చేయడం సిగ్గుచేటని ఖండించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజి, ఈమని అప్పారావు, ఎం.రవి, భావన్నారాయణ ఎస్.ఎస్. చెంగయ్య పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భర్త ఆత్మహత్య

లక్ష్మీపురం: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భర్త ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై శనివారం సాయంత్ర పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టాభిపురం జూట్ మిల్లు పరిసర ప్రాంతానికి చెందిన మేమవరపు రాంబాబు (35) గోరంట్లలోని ఓ స్కూలులో ధోబీ పని చేస్తుంటాడు. భార్య కూలి పనులు చేస్తుంటుంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. రాంబాబు మద్యానికి బానిసై నిత్యం భార్యను డబ్బులు కోసం వేధిస్తూ ఉంటాడు. ఈ క్రమంలో శుక్రవారం డబ్బులు అడిగాడు. భార్య ఇవ్వకపోవడంతో అశోక్ నగర్‌లోని తల్లి ఇంటికి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

దుర్గా నాగేశ్వరరావుకు డాక్టరేట్



ఏఎన్‌యూ: సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగ పరిశోధకుడు టి. దుర్గా నాగేశ్వరరావుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి సుధాకర్ తెలిపారు. ఆ విభాగ పర్యవేక్షకుడు ఆచార్య వి. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'ఎల్డర్లీ ఎబ్యూస్ ఇన్ రూరల్ అండ్ అర్బన్ ఏరియాస్ ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ట్- ఏ కంపారిటీవ్ స్టడీ' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

పరవశింపజేసిన 'భజరే గోపాలం'


కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై శనివారం 'భజరే గోపాలం' నామ సంకీర్తన నిర్వహించారు. మెరైన్ ఇంజనీర్ (గుంటూరు) లింగం చంద్రశేఖర్, గుళ్లపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, నాదోపాసకులు శ్రీరామపాద భాగవతార్ (చెన్నై), రమా శ్రీరామ్, గోకుల్‌కృష్ణ, విక్రమ్, హరిహరసుబ్రహ్మణ్యం పలు వాగ్గేయకారుల సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. ఆదిశంకర, భగవత్పాద, అన్నమాచార్య, రామదాసు కీర్తనలను శ్రీరామపాద భాగవతార్ స్వరబద్ధంగా ఆలపించారు. రామ నామంతో ప్రారంభించిన నామ సంకీర్తనలకు హనుమంతుని స్తుతితో మంగళం పాడారు. హార్మోనియంపై రాజారాం, మృదంగంపై గోపాల్, డోలక్‌పై సాకేత్‌రామ్ వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం నామ సంకీర్తన కళాకారులను సత్కరించారు.

ఫార్మసీ నిపుణులకు విస్తృత ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న సతీష్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: క్లినికల్ రీసెర్చ్, మెడికల్ డివైజెస్ రంగాల్లో ఫార్మసీ నిపుణులకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్‌కు చెందిన క్లినాక్సి ప్రైవేటు లిమిటెడ్ సీఈవో వి. సతీష్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం "క్లినికల్ రీసెర్చ్ అండ్ రెగ్యులేటరీ రైటింగ్ ఇన్ మెడికల్ డివైజెస్" అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశంలో100 క్లినికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్లు ఉన్నాయని తెలిపారు. నూతన ఔషధాలపై నిర్వహించే క్లినికల్ ట్రయల్స్ ఫార్మకోవిజిలెన్సు, క్లినిల్ డేటా మేనేజ్‌మెంట్ రెగ్యులేటరీ అప్రూవల్స్ వంటి పరిశోధనలలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు బీఫార్మసీతో పాటు క్లినాక్సి వంటి సంస్థలు నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులను చేయడం ద్వారా ఔషధ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని సూచించారు. ఫార్మాడీ డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య మాట్లాడుతూ కేంద్ర వైద్యారోగ్యశాఖ నిర్వహిస్తున్న ఔషధ నియంత్రణ సంస్థ, కేంద్ర ఔషధ ప్రయోగశాల, కేంద్ర ఔషధ పరిశోధన సంస్థల్లో ఫార్మసీ నిపుణులకు గల ఉపాధి అవకాశాలను వివరించారు. వర్క్‌షాప్‌లో కళాశాల కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ ఏ. ప్రత్యూష, పి.నాగరాజు, సీహెచ్. వరప్రసాదరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూ కళాశాల పూర్వ విద్యార్థిగా గర్వపడుతున్నా !

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి


లక్ష్మీనారాయణ వాల్మీకిని సత్కరించిన కళాశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ కళాశాల పూర్వ విద్యార్థిగా గర్వపడుతున్నానని అనంతపురం ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ వాల్మీకి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ వార్షిక సమావేశాన్ని శనివారం శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి మాట్లాడుతూ విద్యార్థి దశలో విలువలతో పాటు భావి జీవితానికి బాటలు వేసిన హిందూ కళాశాల తన ఎదుగుదలకు దోహదం చేసిందని తెలిపారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఉన్నతాధికారి డాక్టర్ సీహెచ్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి స్థిరమైన లక్ష్యంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు. విజువల్ ఆర్టిస్ట్ ఆదర్శ బాజీ మాట్లాడుతూ తాను కళా రంగంలో ఈ స్థాయికి చేరుకోవడంలో హిందూ కళాశాల దోహదం చేసిందని, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే తనకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకులు టి. నాగేశ్వరరావు, డి. నాగేశ్వరరావు, ఏ. సుబ్రహ్మణ్యంను సన్మానించారు. విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పొదిలి, బెల్లంకొండ అవార్డులను ప్రదానం చేశారు. సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, మాజేటి సోమశేఖరరావు, కేవీఎస్ దుర్గాప్రసాద్, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, కేఆర్ఎస్ కుటుంబరావు, డాక్టర్ వై.గౌరీ శంకర్, స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి పీవీ రాము, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రీస్తు పుట్టుక వేషధారణలో చిన్నారులు



క్రీస్తు గురించి పాటలు ఆలపిస్తున్న చిన్నారులు

గుంటూరు నగరంలోని లాడ్జి సెంటర్ నార్త్ ప్యారీస్ చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీస్తు పుట్టుక వేషధారణలలో అలరించారు. క్రీస్తును స్తుతిస్తూ పాడిన పాటలు విశ్వాసుల్లో భక్తి భావాన్ని కలిగించాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

వృద్ధుడి అదృశ్యం

పట్నంబజారు: వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు అయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేట రొట్టెల బజారులో నివాసం ఉండే పులుగుమోటు శంకరరావు గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 12 సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల నివాసాల్లో అడిగినప్పటికీ ఫలితం లేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీల కేసులో నిందితుడి అరెస్టు


స్వాధీనం చేసుకున్న బైక్‌లు, డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్‌హెచ్‌ఓ వీరయ్య తదితరులు

పట్నంబజారు: బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో గుంటగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య వివరాలు వెల్లడించారు. ఇటీవల గుంటూరు నగరంలో బైక్ చోరీలు అవుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పక్కా సమాచారంతో ఉమెన్స్ కాలేజీ రోడ్డులో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం, లెనిన్‌నగర్‌కు చెందిన పెరికల సాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా, చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. గుంటూరు నగరంలో కొత్తపేట, లాలాపేట, పాతగుంటూరు, ఖమ్మం, ప్రాంతాల్లో చోరి చేసిన 11 ద్విచక్ర వాహనాలతోపాటు, మూడు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 11 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐలు రమేష్, తరంగిణి, సిబ్బంది ఆంథోని, కోటేశ్వరరావు, అనిల్ తదితరులను అభినందించారు.

ముగ్గురు వ్యక్తుల నుంచి గంజాయి స్వాధీనం



నెహ్రూనగర్: ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 600 గ్రాముల (రూ.8 వేలు విలువచేసే) గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు గుంటూరు వన్‌టౌన్ ఎక్సైజ్ సీఐ లత తెలిపారు. శనివారం వారిని అరెస్టు చేసినట్లు చెప్పారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరావతిలోని లింగాపురానికి చెందిన వేమవరపు ప్రేమ్‌కుమార్ పాడేరు వెళ్లి గంజాయిని తీసుకొని వచ్చి మిత్రులైన గుంటూరు నగరానికి చెందిన గుణ్ణం యశ్వంత్ సాయిరాం, గొట్టిముక్కల సుమంత్‌లతో కలిసి చిన్నచిన్న పొట్లాలుగా కట్టి విక్రయిస్తున్నారని తెలిపారు. నిందితులను వాసవీ నగర్ ఎక్స్‌టెన్షన్ బొమ్మరిల్లు అపార్టుమెంట్ రోడ్డులో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ మొహమ్మద్ ఖాసిం షరీఫ్, సిబ్బంది బసవేశ్వరరావు, పూర్ణచంద్రరావు, సంధ్య, మస్తాన్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.